227059101

అద్దమందున ప్రతిబింబ మంటనట్టుల
తామరాకులు నీటిచే తడువనట్టుల
పాపములు అంటవు మానవుని భక్తివలన
జనన మరణాలు రెండును జంటనుండు
రెండు చక్రాల బండిని నుండునట్టుల
ఒకటి పోయిన సృష్టియు ఆగిపోవు
ఇదియె సృష్టి రహస్యము ధరణిమీద..

ప్రేమస్వరూపులైన విద్యార్థులారా!

ఏకోహం బహుస్యాం. ప్రజాపతి సత్సంకల్పము చేత మూలము స్థూలము, జడము చైతన్యము, ప్రాణము ప్రాణి అనే జంటలను సృష్టించి వాని సంయోగము చేతనే జగత్తు చరాచర ప్రపంచమంతయూ సృష్టింప బడుతూ వచ్చింది. కనుక చరాచర ప్రపంచమునకంతయు ప్రాణమైన సూర్యుడు, ప్రాణియైన చంద్రుడు ఈ రెండింటి సంయోగమే మూలకారణమని నిన్నటి దినము కశ్యపమహర్షి మనుమడైన కదంబికి బోధించాడు. కదంబి ఋషి వాక్యమును చక్కగా శ్రవణము చేసి సృష్టిరహస్యాన్ని గుర్తించి ఆనందముతో తాను తన హృదయమును నింపుకొని వుండగా విదర్భ దేశీయుడైన మరొక శిష్యుడు భార్గవుడు ప్రవేశించి పిప్పిలాది మహర్షికి నమస్కరించి స్వామీ! జనన మరణములు తీరని బాధలుగా వుంటున్నవి. పుట్టినవారు గిట్టక గిట్టినవారు పుట్టక తప్పదని సమస్త శాస్త్రములు ప్రబోధిస్తూ వున్నవి. జనన మరణముల చేత జీవితము ఈ విధముగా గడచి పోయిన దీనికి అంత్యము ఎప్పుడు? దీనికి ఆధారము ఏమిటి? అనే ప్రశ్నను వేశాడు పిప్పలాద మహర్షికి.

నాయనా! ఆద్యంత రహితుడు భగవంతుడు. చరాచర ప్రపంచమంతయు కేవలము మిథ్యమైనది. నిత్యము నందు సత్యమున్నప్పటికిని స్వరూపము నిరూపమయ్యేటు వంటిది. ఇవన్నీ అంత్యముతో కూడినవే.. సూర్యుని వలన సంవత్సరములు, నెలలు, రాత్రింబవలు ఏర్పడుచున్నవి. ఇవన్నియూ కాలవాహనములో భాగములే. దీనికి సూర్యగమనమే మూలము, ఈ సమస్త భాగములు ప్రజాపతి యొక్క ప్రాతినిధ్యముతో కూడి వుంటున్నది. కాలము ప్రజాపతిస్వరూపము

ఈ కాలమునను ఉత్తరాయణము, దక్షిణాయనము అని రెండు ఆయనములుంటున్నవి. ఆయనములనగా ప్రయాణము చేయుటము. ఉత్తరమునకు సూర్యుడు ప్రయాణము చేస్తున్నప్పుడు ఉత్తరాయణమని, దక్షిణమునకు ప్రయాణము చేస్తున్నప్పుడు దక్షిణాయమని పేరు.

ఉత్తరాయణమన్నది కాంతిలో, శాంతిలో, సంతోషములో, నిర్భయముతో నిర్మలంగావుంటుంది. ఇంక దక్షిణాయనమనగా చీకటిలో, అశాంతిలో భయముతో, దిగ్భ్రాంతి తో కూడి వుంటుంది. దక్షిణాయమున ప్రయాణము గావించే సాధకులు, గమనము చేయవలసిన సాధకులు, యజ్ఞయాగాదులలో దానధర్మాదులలో పుణ్యకార్యములు చేసి దక్షిణామార్గములో ప్రయాణము సల్పుతారు. ఈవిధముగా ప్రయాణము సల్పి చంద్రుని చేరుతారు. చంద్రుడు రయి అనగా matter. కేవలము భౌతికమైన వాంఛల చేత, భౌతికమైన కోరికల చేత, భౌతికమైన సుఖముల చేత కేవలము భౌతికమునే పొందుతారుగాని భగవంతుని పొందలేరు. ఈ పుణ్యకాలము వుండినంత వరకు వారు చంద్రలోకములో వుంటుండి పుణ్యకాలము క్షీణించగానే తిరిగి మర్త్యలోకమునకు వస్తూ వుంటారు. దీనిని పురస్కరించుకొని యే క్షీణే పుణ్యే మర్త్యలోకం విశంతి. electionలో విజయము గాంచినవాడు ఐదు సంవత్సరములు ఆ assemblyలో కూర్చుంటాడు. ఒక్కొక్క సంవత్సరము తరిగి పోవు కాలదిక్రమమేరకా assemblyకి కొంత దూరమవుతాడు. ఐదు సంవత్సరములు పూర్తి కాగానే అతనికి ఆ assembly లోపల సీటు వుండదు. అదే విధముగానే మానవుడు పుణ్యకర్మల చేత, పవిత్ర కర్మల చేత సార్థక తను పొందిన చంద్రలోకములో యీ పుణ్యకాలము వుండినంత వరకు తాను అక్కడ నివసించి యీ పుణ్యము క్షీణించగానే తిరిగి మర్త్యలోకములో జన్మిస్తాడు. ఉత్తరాయణమున ప్రయాణము సల్పువాడు బ్రహ్మ భావముతో, బ్రహ్మజ్ఞానముతో, బ్రహ్మానురక్తితో, బ్రహ్మ తత్త్వములో తాను సూర్యమండలము చేరుతాడు సూర్యమండలము ప్రాణము. ఈ ప్రాణములో చేరిన తరువాత తిరిగి అతనికి పునర్జన్మ నవిద్యతే. తిరిగి అతను యీలోకమునకు రాడు. నాయనా! ప్రాణముతో ప్రాణము చేర్చినప్పుడే యిది సార్థకమవుతుంది. భావములో నీ జీవితము చేర్చినప్పుడు భ్రమగానే మారుతుంది. భ్రమ వుండినంత వరకూ బ్రహ్మమనను ప్రాప్తించడు. కనుక బ్రహ్మ భావము చేత బ్రహ్మమును పొందినప్పుడు పునర్జన్మమనేది వుండదు. కనుక బ్రహ్మవిత్ బ్రహ్మైవ భవతి. బ్రహ్మ తత్వాన్ని గుర్తించిన వాడు బ్రహ్మగానే రూపొందుతాడు. కనుక నీవు ఉత్తరాయణ, దక్షిణాయములందు పున

227059103

ర్జన్మ, పునర్జన్మ లేకపోవటం రెండూ గుర్తించటానికి ప్రయత్నించు.

దక్షిణాయనము ప్రయాణము సల్పినవానికి పునర్జన్మము వున్నది. ఉత్తరాయనము ప్రయాణము సల్పినవానికి పునర్జన్మ లేదు. తాను పరిపూర్ణుడౌతాడు. ఈ విధముగనే సూర్యునకు పంచ భూతములు పంచపాదములుగా వుంటున్నవి. పన్నెండు నెలలు పన్నెండు రాశులుగా వుంటున్నవి. ఒక్కొక్క నెల ఒక్కొక్క రాశిలో ప్రవేశిస్తూ వుంటాడు సూర్యుడు. ఈ విధముగా పన్నెండు నెలలు పన్నెండు రాశులలో ప్రయాణము సల్పటం వలన అతిలోపల ఒక విధమైన కాంతి రూపొందుతుంది. అదియే ఏడురంగలుగా రూపొందే మార్పు. ఒక్కొక్క నెలకు రెండు పక్షములు. ఒకటి శుక్లపక్షమని రెండవది కృష్ణ పక్షమని. ఈ శుక్ల పక్షమనగా ఏమిటి? ఈ శుక్ల పక్షమనగా ఏమిటి? శుక్ల పక్షమందు చంద్రుడు సూర్యునకు ఎదురుగా వుండటం చేత సూర్యుని పరిపూర్ణ తేజస్సు చంద్రునిపై ప్రసరించి చంద్రుడు కూడను పదహారు కళలతో దేదీప్యమానముగా వెలుగుతాడు. అనగా ప్రాణమునకు సమపంగా వుండటంచేత ప్రాణి యొక్క పదహారు కళలు పరిపూర్ణ స్వరూపాన్ని ధరించి దానినే పూర్ణిమ అనే పేరుతో దేదీప్యమానంగా వెలుగుతాడు. అమావాస్యదినము చంద్రుడు సూర్యునిలో లీనమైపోతాడు. సూర్యునిలోపల లీనం కావటం చేతనే చంద్రుడు కనుపించడు. కనుక పౌర్ణిమ నుండి కూడ చంద్రుని తేజస్సు క్షీణించి పోవటమే కృష్ణ పక్షమని అమావాస్యనుండి క్రమక్రమేణా చంద్రుని ప్రకాశము అభివృద్ధి కావటంచేత దీనిని శుక్లపక్షమని. శుక్లపక్షము ప్రాణము, కృష్ణ పక్షము ప్రాణి. ఈ ప్రాణి ప్రాణముల యొక్క సమ్మిళితమైన స్వరూపమే దివ్యమైన జగత్తు. ఇవన్నియు కేవలము ప్రజాపతి సంకల్పము యొక్క ప్రభావము. ఏకోహం బహుస్యాం. వున్నది ఒక్కటే అయినప్పటికిని అనేకంగా రూపొందుతూ వస్తున్నాయి. ఎట్లనగా ఒక విత్తనమును మనము భూమిలో నాటినప్పుడు అది విశాలమైన వృక్షముగా రూపొంది ఆ వృక్షములోపల వేలాది కాయలు కాచి ఒక్కొక్క కాయ లోపల అనేక విత్తనములు ఏర్పడి తిరిగి అనేక విత్తనముల ద్వారా అనేక వృక్షములు ఏర్పడుతున్నాయి. నాటినది ఒక విత్తనమైనప్పటికిని ఇన్ని వృక్షములుగా రూపొందటానికి కారణం ఏమిటి? అదే ఏకోహం బహుస్యాం. ఒక విత్తనమే అనేక వృక్షములుగా రూపొందుతూ వచ్చింది. ఒక్క ప్రాణమే అనేక ప్రాణములుగా విభజిస్తూ వచ్చింది. కనుక సృష్టికి ఒక విధమైన నియమమని గాని, ఒక విధమైన అర్థమని గాని లేదు. ప్రారంభములో ప్రాణి, ప్రాణము యీ రెండే వుండేటువంటివి. ఈ రెండింటి సంయోగము చేతనే యింత జగత్తుగా రూపొంది వుంది. ఈ జగత్తునకు అంత్యము లేదు. ఆది కూడను లేదు. ఇలాంటి ఆద్యంత రహితమైన దైవ సంకల్పమును ప్రాణులు

227059104

గా భావించుకోటం చేతనే యీ ప్రాణులకు అంత్యమున్నట్టుగా విశ్వసిస్తున్నారు. సృష్టి స్థితి లయములందు దైవము యొక్క సంకల్పములే కాక మానవుని యొక్క ప్రయత్నములు కొంత ఇమిడి వుంటున్నవి. తాను చేసే కర్మలను పురస్కరించుకొని తాను తలచే భావములను పురస్కరించుకొని తాను అంత్యమునందు చేరవలసిన మంచి చెడ్డల స్థానములను చేరుతూ వస్తున్నాడు. కనుకనే మాధవుని నుండి పుట్టిన మానవుడు మాధవత్వమును మరచి పోతున్నాడు. కనుకనే దానవత్వంగా రూపొంది పశుత్వంగా ప్రవర్తించి కేవలం పవిత్రమైన జీవితమును నిరర్థకం చేసుకుంటున్నాడు. నాయనా! మరణము లేకుండా పోదు. జననము లేకుండా పోదు. కాని మరణించిన తరువాత జననము లేకుండా చేసుకునే శక్తి సామర్థ్యములు జీవునికి వున్నవి. అంత్యము నీ చేతియందే వుంటున్నది. ఒక చిన్న విత్తనము green gram వున్నదనుకోండి. అది భూమిలో పెట్టేటప్పటికి అది మొక్కగా వచ్చి అనేక కాయలు కాస్తుంది. కాని ఆ పెసర విత్తనము ఎక్కడనుండి పుట్టిందో ఎవరు తండ్రో ఎవరు తాతనో ఎవరు ముత్తాతనో ఎవరు చెప్పటానికి వీలు లేదు. ఎంత కాలమునుంచి పరంపరంగా యీ జన్మము ధరిస్తూ వుంటుండాదో. కనుక ఆదిని ఎవరూ చెప్పలేరు. కాని ఒకటిగాని దానిని నోట్లో వేసుకొని నములుటే అంత్యము మాత్రము మన చేతిలో వుంటున్నది. ఆది మనకు తెలియదు గాని అంత్యము మన చేతిలో వుంటున్నది. మానవుడు ఏనాడు పుట్టాడో ఏ విధంగా పుట్టాడో దానికి ఆది చెప్పుటకు వీలు కాదు. అంత్యము మాత్రము మనము చేసే సాధనలతో ఇమిడి వుంటున్నది. నీవు ఉత్తర ప్రయాణము గావించినప్పుడు బ్రహ్మ భావము చేత బ్రహ్మ జ్ఞానము చేత బ్రహ్మ తత్త్వము చేత దివ్యప్రేమ చేత నీవు దివ్యాత్మను పొందగలవు. విద్యార్థులారా paddy. దీనిపైన husk వుంటున్నది. పొట్టు వుండినంత వరకు ఏ భూమిలో పెట్టి నీరు పోసినా పునరపి జననం పునరపి మరణం. కాని ఆ పొట్టును తీసేస్తే బియ్యముగా రూపొందుతుంది. ఈ బియ్యమును భూమిలో పెట్టేటప్పటికి పునర్జన్మ నివృత్తి. ఇంక దీనికి జన్మము లేదు. paddy కి birth వుంది. కాని paddy లోని rice కు birth లేదు. ఈ paddy కి rice కి వున్న difference ఏమిటి? with husk paddy. without husk rice. with desires పునరపి జననం. without desires పునర్జన్మ నివృత్తి.

కనుక మేటరుపైన మనము స్కూటరు మాదిరి ప్రయాణము చేస్తున్నాము. జీవితమంతా matter, matter. ఇదే రయి. ఇది చంద్రుని కాంతి. చంద్రుడనగా ప్రకాశించే ఆ చంద్రుడు కాదు. చంద్రమా మనసో జాతః చక్షోః సూర్యో జాయత

227059105

మన యొక్క మనస్సే. ఈ మనస్సునందు సంకల్పవికల్పములు వుండినంత కాలము మనకు జన్మము తప్పినది కాదు. ఈ సంకల్ప వికల్పములను బ్రహ్మభావము చేత అమనస్కము గావించుకున్నప్పుడు యింక ఎట్టి జన్మము మనకు వుండదు. కనుక భార్గవా! జనన మరణములు అనాదివని యివి తప్పినవి కావని అని నీవు భావిస్తున్నావు. కాదు కాదు. జనన మరణములనుండి అతీతస్థాయికి పోయే అవకాశము వుంటున్నాదని దీనికి చక్కని యుక్తులు చెప్పాడు పిప్పలాది మహర్షి. తదుపరి మూడవ శిష్యుడు ప్రవేశించాడు. గురువునకు నమస్కరించి స్వామి! ఈ జీవుల లోపల ఏ విధమైన ప్రాణాలు దీని రక్షించి పోషించి వృద్ధి చేస్తున్నవి. అతనే అశ్వలాయనుడు. ఈ అశ్వలాయనుడు వచ్చి స్వామి! ఈ జీవులకంతా ప్రధానమైన జీవుడు ఎవరు? ఈ జీవునకు అనేక అంగములుంటున్నవి. అనేక అంగములందు సమర్థమైన శక్తి ఏదో ఒకటి వుంటున్నది. ఆశక్తి ఏమిటని ప్రశ్నించాడు. నాయనా! ఆకాశమునుండి వాయువు, తేజస్సు, జలము, భూమి యివి ఆవిర్భవిస్తున్నాయి. వీటి అంశము లే వాక్కు, దృష్టి శ్రవణము మనస్సు యీ నాలుగు ప్రాణులను రక్షిస్తున్నాయి. ఇందులో ప్రధానమైనది సూక్ష్మతత్త్వమైన ప్రాణము. ప్రాణమే లేకుండిన కన్నులు చూడలేవు. చెవులు వినలేవు. నోరు మాటాడ లేదు. మనసు తన పని తాను చేయలేదు. కనుక అన్ని అంగములకంటె ప్రధానమైనది ప్రాణము. ఈ ప్రాణమునకు నిలయమైనది దేహము. కనుక దేహమనే దేవాలయమును ఆశ్రయించుకొని ప్రాణము జీవిస్తూ వుంటున్నది. దేహో దేవాలయ ప్రోక్తో జీవో దేవ సనాతనః. ఈ ప్రాణము సనాతనమైనది. ఈ నూతనమైన దేహమును ఒక భవనముగా ఆశ్రయించి వుంటున్నది. ఈ దేహము లోపల శత సహస్ర నాడులు వికసించి ఉపాంగముల చేత సర్వత్రా వ్యాపించి వుంటున్నాయి. దేహమంటే కేవలము సామాన్యమైంది కాదు. శత సహస్ర నాడుల చేత దేహము వ్యాపించి వుంటున్నది. నిజముగా విచారణ చేసినప్పుడు 72 కోట్ల నాడులుంటున్నాయి దేహములో. ఈ 72 కోట్ల నాడులందు వ్యాన అనే ప్రాణము సంచరిస్తూ వుంటున్నది. ఈ వ్యాన అనే ప్రాణము కనుక లేకపోతే యీ నాడులు యేమాత్రము పని చేయలేవు ఉదాన అనే ప్రాణము పై చూపులో వుంటుంటాది. అది నిరంతరము మానవుడు చేసిన పుణ్యపాప కర్మములను పురస్కరించుకొని ఆయా స్థానములను చేరుస్తుంది. కనుక మన మన స్థానములంతా కూడను మనము చేసే కర్మలపైన ఆధారపడి వుంటుంది. కనుక కష్టములకు కృంగక, సుఖములకు పొంగక సమత్వాన్ని అనుసరించమని శాస్త్రములు ప్రబోధిస్తూ వస్తున్నాయి. కష్టములు ఎవరో మనకు అందించినవి కావు. సుఖములు కూడను ఎవరో మనకు సహాయము చేసి పెట్టినవి కావు. కష్టములకు

సుఖములకు మనమే మూలకారణము. ఏదో బలహీనత చేత వారివల్ల నాకో కష్టము కలిగింది, వారివల్ల నాకో దుఃఖము కలిగింది అని యితరులను నిమిత్త మాత్రంగా ఎన్నుకుంటున్నారేగాని యితరులెవ్వరూ దీనికి కారకులు కారు. తన కష్టసుఖములకు తన నష్ట ఆదాయములకు, మానాభిమానములకు, కీర్తి గౌరవములకు మన సంకల్పములే మూలకారణము. మనము చేసిన కర్మలే దీనికి మూలకారణము.

పాపమనగ వేరు పరదేశమున లేదు
తాను చేయు పనుల తగిలియుండు
దేవుడనగ వేరు దేశమందున లేడు
తాను చేయు పనుల తగిలియుండు.

మన కర్మలను పురస్కరించుకొనియే మనము స్వర్గమో నరకమో మోక్షమో యింకో విశేషమైన స్థానమో పొందుతూ వుంటున్నాం. దీనిని ఉదానవాయువు అందిస్తూ వుంటున్నది. ప్రాణములు ఐదుగా విభజించారు. ప్రాణ, అపాన, వ్యాన, ఉదాన, సమాన ఇవి కేవలము మన దేహమునందు మాత్రమే కాకుండా బయటప్రపంచములో వుండిన పంచభూతములందు ప్రత్యక్షముగా మనకు గోచరిస్తున్నాయి. సూర్యుని యందు ప్రాణము. భూమినుండి అపాన. ఆకాశము నుండి సమాన, గాలినుండి ఉదాన అగ్నినుండి వ్యాన. ఈ పంచభూతములందు ఒక్కొక్క ప్రాణము అంతర్భూతమై వుంటున్నది. ప్రతి ప్రాణమునకు అతి సమీపములో మానవుడు చేసిన మంచి చెడ్డల ప్రతిబింబాలు కూడా వుంటున్నాయి. సృష్టి యొక్క రహస్యము ఎవరు అంత సులభంగా చెప్పలేరు. ఇప్పుడు యీ వస్తువునకు దాని ప్రక్కనే నీడ వెంటాడుతున్నది. అదే విధముగా ప్రాణమునకు మనము చేసే మంచి చెడ్డల shadow గా వెంటాడుతూ వుంటాయి. ప్రాణము ఎక్కడ పోతే అక్కడంతా దాని shadow వస్తుంటాది. ఈ జన్మలో యీ దేహములో వుండినప్పుడు మనము చేసే మంచి చెడ్డలంతా దానికి తగిన ఫలము నిచ్చి మరొక దేహానికి యీ ప్రాణము పోయినప్పుడు యివన్నీ దాని వెంటాడుతూనే వుంటాయి. ఈ ప్రాణము ఎక్కడకు పోతుంది? ఈ దేహములో ఏవిధమైన మంచి చెడ్డలు నీవు ఆచరించితివో దానికి తగిన ఫలమును అందించి దేహానికే పోయి చేరుతుంది గాని మరొక దేహానికి పోయి చేరదు. కనుకనే మంచి పనులు చేసి మంచి చింతలను మనము ఆశించి మంచి భావముతో మనము జీవించినప్పుడే మంచిస్థానమును మనము చేరుతాము. నిమ్మవిత్తులు నాటిన నిమ్మఫలమే కలుగును. మామిడి విత్తనము నాటిన మామిడి ఫలములే లభించును. నిమ్మవిత్తనము నాటి మామిడి ఫలము నాశిస్తే మామిడి ఫలము లభ్యమవుతుందా? కాని మానవుడు అనేక రకములుగా

227059107

దీనిని చింతిస్తూ వుంటాడు

అది చేతు ఇది చేతు యింకెన్ని యీ చేతు
ననుచు ఊహలు అల్లి అలసిపోకు
ఏ విత్తులను నాటి యిచ్చోట నుంటివో
ఆ ఫలమ్ములె మను అందుచుండు
విత్తన మొకటైన వేరైన ఫలములు
సంభవించుట ఎట్లు సాధ్యమగును.
జనని గర్భము నుండి జన్మించినప్పుడు
కంఠమాల లేవి కానరావు
మంచి ముత్యపు సరుల్ మచ్చునకును లేవు
మేల్మి బంగరు దండ మెడకు లేదు
రత్నాల హారముల్ రంజిల్లగా లేవు
పచ్చలు కెంపులు పొదగలేదు
వజ్రాల హారముల్ వర్ధిల్లగా లేవు
గోమేధికంబులు తోడ లేవు
కలదు కలదొక్క మాల మీ కంఠమందు
ఎన్ని చేసిన అవియన్ని ఏరి ఏరి
మంచి యైనను చెడుగైన త్రుంచకుండ
బ్రహ్మ మీ కిచ్చి పంపును బరువు మాల
కర్మలన్నియు చేర్చిన కంఠమాల

ఓ మానవులారా జగత్తునందు యీ సుఖ దుఃఖములకు గాని ఏ ఆనందమునకు గాని మనము చేసుకున్న మంచి చెడ్డల కర్మలే దీనికి మూల కారణమని గుర్తించి, మంచి కార్యములలో ప్రవేశించి, మంచి భావములను పెంచుకొని, మంచి జీవితము లోపల మంచిని పొందమని బోధిస్తూ వస్తుంది. మనము చేసినవి మనకే లభిస్తాయి గాని మరొకరికి కాదు. నీవు తిన్న పదార్థము త్రేపువాసన నీకే లభిస్తుంది. గాని యింకొకరికి లభిస్తుందా? నీవు మామిడి పండు భుజించినప్పుడు నీకే వస్తుంది గాని ఆ మామిడి పండు త్రేపు మరొకరికి రాదు. లేక నీవు మామిడి పండు తిని దోస పండు త్రేపు రావాలంటే వస్తుందా? రాదు. కనుక మన మంచి చెడ్డలకు మనమే మూలకారణము. దీనికి భగవంతుడు కూడను కారణము కాదు. భగవంతుడు నిమిత్త మాత్రుడు కాని చెడ్డ కర్మలు ఎన్ని వుండినప్పటికిని, పాపములు ఎన్ని చేసినప్పటికిని, పరతత్వ

227059108

ము లోపల భగవంతుని హృదయ పూర్వకముగా ప్రార్థిస్తే సర్వకర్మలు మంచువలె మాయమై పోతాయి. కనుక

అద్దమందున ప్రతిబింబమంటనట్టుల
తామరాకులు నీటిలో తడవనట్టుల

భక్తియె వుండిన యీ కర్మలు యే మాత్రము మనలను బాధించ లేవు. అణుమాత్రమైన నిప్పు కణము పర్వతముల వంటి ప్రత్తిలో వేసినప్పుడు సర్వము భస్మమై పోతుంది. అణుమాత్రము చాలు కనుకనే

యా చింతా భువి పుత్ర మిత్ర భరణా వ్యాపార సంభాషణే
యా చింతా ధన ధాన్య భోగ యశసే లాభే సదా జాయతే
సా చింతా భువి నందనందన పదద్వంద్వార విందే క్షణే
కా చింతా యమరాజ భీమ సదన ద్వార ప్రయాణే ప్రభో.

పుత్ర మిత్ర భరణ వ్యాపార నిమిత్తమై నీవు యెంత మనస్సు యోచిస్తూ వుంటున్నావో చింతిస్తూ వున్నావో, ధన ధాన్య భోగముల నిమిత్తమై అవలి నిమిత్తమై, ఆదాయముల నిమిత్తమై ఎంత నీవు కాలమును వ్యర్థము చేసి చింతిస్తున్నావో ఆ కాలములో ఒక్క క్షణ కాలమందైనా భగవంతుని పాదారవిందముల యొక్క చింతన చేసినప్పుడు భయంకరమైన యముని ద్వారములు కూడను ఒక్కసారి తెరవబడిపోతాయి. మనము ఏ భౌతికమైన, ఏ లౌకికమైన దాని కోసం మనం దీనిని వినియోగం చేసి చింతిస్తున్నామో ఆ కాలములో క్షణ కాలము భగవంతుని కోసం వినియోగము చేయక పోతే మనకు ఎట్లా యీ శాంతి లభిస్తుంది. ఏ విధంగా మనకు యీ ధన్యత లభిస్తుంది. కనుక నాయనా! దీనికి ప్రాణమే ప్రధానమైనది. నీవు ఆచరించవలసిన మార్గము ఒకటి వున్నది. నీ యింద్రియములను మనస్సుతో చేర్చు. మనసును ఆత్మలో చేర్చు. ఏ కర్మలను ఆచరించినా ఆత్మార్పిత భావముతో నీవు ఆచరించు. ఇదే పిప్పలాది మహర్షి చెప్పిన సర్వకర్మ భగవత్ప్రీత్యర్థం. భగవత్ ప్రీత్యర్థంగా నీవు కర్మలాచరించు. కర్మలు పూర్తి మాననక్కరలేదు. వ్యాపారము నీవు చేయి నీవు ఉద్యోగములు నీవు చేయి. నీవు చేయవలసిన ప్రాక్టీసు నీవు చేసుకో. డాక్టరుగా వుండు లాయరుగా వుంటుండు. బ్యాంకరుగా వుంటుండు. ఎట్లా వుండిన ప్రతికి work will be transformed into worship. నీవు చేసే ప్రతి పని worship గా మార్చుకో. ఈ విధంగా చేసినప్పుడు పునర్జన్మ నివృత్తి. నీకు జన్మ లేదు. కేవలము మాటలలో చెప్పి యీ కర్మలంతా కృష్ణార్పణం అనుకొని చేస్తే కాదు. హృదయములో చెయ్యాలి. మాటలతో చేసే అర్పితము మనకు మాటలతోనే వస్తుంది లాభము.

227059109

స్వామి రండి మా యింటికి అని పిల్చినప్పుడు నాయనా వస్తాను మీయింటికి అంటాను. అంతే గాని నేను రావటం లేదు నేను పిల్చటం లేదు. హృదయముతో పిల్చినప్పుడు హృదయముతోనే వస్తాను. యద్భావం తద్భవతి. ఎట్టి ఆశనో అట్టి భావము. ఎట్టి భావమో అట్టి ఫలము. కనుక నీవు ఏది చేసినప్పటికిని హృదయపూర్వకంగా చేయి. మానవుని యొక్క హృదయమునందే శతసహస్ర నాడులంతా సర్వవ్యాపిగా పోతున్నాయి. దేహమంతా వ్యాపించి వుంటున్నాయి. హృదయములోపల ఏ సత్సంకల్పము వచ్చినప్పుడే దేహమంతా కూడా సత్సంకల్పముతో వ్యాపించి పోతుంది. అవి హృదయమునుంచే వ్యాపించి పోతున్నాయి. కేవలము physical heart కాదు. spiritual heart. ఈ విధమైన దాంట్లో ప్రేమపూర్వకంగా మనము దానిని ప్రసరింప చేసుకున్నప్పుడు దానికి జన్మ అనేదే లేదు. ప్రతి మానవునకు నిత్య జీవితములో ఏవో సందేహములు వుంటున్నవో అలాంటి సందేహములంతా యీ ఆరుమంది బ్రహ్మచారులు జిజ్ఞాసులైనవారు ఈ విధమైన ప్రశ్నలు వేసి పిప్పలాద మహర్షి నుంచి సరియైన జవాబులు తెలుసుకుంటూ వచ్చారు.

మొట్టమొదటి ప్రశ్న. సృష్టికి కారణము ఏమిటి? సంకల్పమే దీనికి కారణము. ఇక్కడ కూడను సులభంగా అర్థమయ్యేటట్లుగా చెప్పాడు. నాయనా స్వప్నానికి కారణం ఏమిటి? కొంతమంది అజీర్ణము వల్ల స్వప్నాలు వస్తాయి. Thoughts వల్ల స్వప్నాలు వస్తాయి అని. మరికొంతమంది దేహము యొక్క బలహీనత చేత స్వప్నాలు వస్తాయని. కాని యివి ఏవీ సరియైన కారణాలు కాదు. స్వప్నానికి ఏది కారణము? నిద్రనే కారణము. నిద్ర వచ్చినప్పుడే స్వప్నము వస్తుంది. నిద్ర లేని వానికి స్వప్నమే లేదు. కాబట్టి సృష్టికి ఏది కారణము. సంకల్పమే కారణము. కనుక ఆ సంకల్పమనే చిత్తనము రూపుమాపినప్పుడు సృష్టికి అవకాశమే లేదు. సర్వ సృష్టి కూడను ద్రష్టగానే మారుతుంది. అంతా ఒకటిగానే ఆనందమయంగానే రూపొందుతుంది. కనుక సత్సంకల్పాలను క్రమక్రమేణా అదుపులో వుంచుకోమని యీ విద్యార్థులకు ప్రబోధించాడు. రేపటి దినము నాల్గవ శిష్యుని గురించి విచారిస్తాము.

సత్యసాయి విద్యా విహార్ బాలవికాస్ పిల్లలు కొన్ని ఉత్సవాల లోపల మేకప్ లు చేసుకొని కాచుకున్నారు, ఒక నృత్యముతో బాటు ఒక డ్రామాను కూడను ప్రదర్శిస్తారు. అందువలన యీనాడు మూడవ శిష్యుని గురించి మాత్రం ముగిస్తున్నాను.